పెదగంట్యాడపై కాలుష్య సెగ


సిమెంట్ ఫ్యాక్టరీ ప్రతిపాదిత ప్రాంతానికి చేరువలో ఉన్న కాలనీలు


ధూళితో కళావిహీనంగా ఉన్న ప్రాంతం


పోర్టు నుంచి వెలువడే దుమ్ము,ధూళితో హౌసింగ్‌బోర్డు ప్రాంతం

- గంగవరం పోర్టు, ఆటోనగర్ పరిశ్రమలు, డంపింగ్ యార్డ్‌తో ఇప్పటికే సతమతం
- తాజాగా సిమెంట్‌ఫ్యాక్టరీ ఏర్పాటుకు అడుగులు
- మండిపడుతున్న ప్రజానీకం
- వెల్లువెత్తుతున్న నిరసనలు

పెదగంట్యాడ: గంగవరం పోర్టు నుంచి వచ్చే దుమ్ము ధూళితో ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. మరో పక్క ఆటోనగర్‌లోని పరిశ్రమల నుంచి వెలువడే కాలుష్యంతో జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. స్థానిక డంపింగ్ యార్డ్ నుంచి వచ్చే దుర్వాసనతో దిక్కుతోచని స్థితిలో ఉన్న పెదగంట్యాడ మండల ప్రజలపై ఇప్పుడు మరో పిడుగు పడనుంది. అదే అదానీ సిమెంట్ ఫ్యాక్టరీ. ఈ ఫ్యాక్టరీ వస్తే.. దాని నుంచి వచ్చే కాలుష్యం కారణంగా మరిన్ని సమస్యలు ఉత్పన్నమవుతాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అంబూజా సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటును అడ్డుకోవడానికి ఉద్యమాలకు దిగారు. ఈ నెల 8న నిర్వహించతలపెట్టిన ప్రజాభిప్రాయ సేకరణలో గళం విప్పడానికి సిద్ధమయ్యారు.

పోర్టులో అంబుజా సిమెంట్స్ గ్రైండింగ్ యూనిట్

అదానీ గంగవరం పోర్టు ప్రాంగణంలో అంబుజా సిమెంట్స్ గ్రైండింగ్ యూనిట్ ఏర్పాటు ఏర్పాటు చేసేందుకు రంగం సిద్ధం చేశారు. 8 హెక్టార్లలో ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు చేశారు. స్టీల్, పవర్ ప్లాంట్ల నుంచి వచ్చే స్లాగ్, ఫ్లైయాష్ వంటి పారిశ్రామిక ఉప ఉత్పత్తులను ఉపయోగించి క్లింకర్, జిప్సమ్‌ను రైలు, సముద్ర మార్గాల్లో తరలించనున్నారు. ఈ ప్లాంట్ తక్కువ పర్యావరణ ప్రభావం కలిగిన ఆరెంజ్ కేటగిరీ ప్రాజెక్ట్‌గా చెబుతున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా..

అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీని నిబంధలకు విరుద్ధంగా ఏర్పాటు చేయడానికి సిద్ధమయ్యారని ఆరోపణలు ఉన్నాయి. ఈ ఫ్యాక్టరీని ముందుగా ఒడిశాలో ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నారు. అక్కడి ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో దానిని ఇక్కడ ఏర్పాటు చేస్తున్నారు. దీనికి సంబంధించిన అన్ని అనుమతులను ప్రభుత్వం మంజూరు చేయడంతో ఫ్యాక్టరీని గ్రైండింగ్ చేసేందుకు రంగం సిద్ధం చేసేశారు. సిమెంట్ ఫ్యాక్టరీ వల్ల వచ్చే కాలుష్యం గురించి ఆలోచించకుండా ప్రభుత్వం **అనుమతులు మంజూరు చేయడంతో** స్థానికంగా **తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. అయి**నా పట్టించుకోకుండా **స్టీల్‌ప్లాంట్ టీసీ గేటు సమీప**ంలో పెట్రోల్ **బంక్ వెనుక 20 ఎకరాల్లో అంబుజా సి**మెంట్స్ లిమిటెడ్ **పేరుతో పెట్టడానికి ఏర్పాట్లు** చకచకా చేస్తున్నారు.

పరిశ్రమను వ్యతిరేకిస్తూ నిరసనలు

పెదగంట్యాడ ప్రాంతంలో అంబుజా సిమెంట్ పరిశ్రమను ఏర్పాటుకు అనుమతించొద్దని ఇప్పటికే పలు అఖిలపక్ష కార్మిక సంఘాలు, గ్రామస్తులు, పెద్ద ఎత్తున నిరసనలు, ర్యాలీలు నిర్వహిస్తున్నారు. తహసీల్దార్‌కు వినతులు అందజేశారు. అదానీ గంగవరం పోర్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న అంబుజా సిమెంట్స్ ఫ్యాక్టరీని అడ్డుకుంటామని ప్రజా సంఘాలు పేర్కొన్నాయి.

8న ప్రజాభిప్రాయ సేకరణ

అదానీ గంగవరం పోర్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న అంబుజా సిమెంట్స్‌కు సంబంధించి ఈ నెల 8న ప్రజాభిప్రాయ సేకరణ కోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. 75వ వార్డు పరిధిలోని అయ్యన్నపాలెం సమీపంలోని వెటర్నరీ ఆస్పత్రి పక్కన గల జీవీఎంసీ పార్కులో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు పెదగంట్యాడ మండల తహసీల్దార్ అమల తెలిపారు.

పెరగనున్న సమస్యలు

ఇప్పటికే గంగవరం పోర్టు తో పాటు డంపింగ్ యార్డు నుంచి వెలువడే దుమ్ము, ధూళి కాలుష్యం కారణంగా అటు గాజువాక, ఇటు పెదగంట్యాడ ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఇప్పుడు సిమెంట్ ఫ్యాక్టరీ వస్తే మరింత కాలుష్యం వెదజల్లే ప్రమాదం ఉందని ప్రజా సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. సిమెంట్ ధూళితో శ్వాసకోశ వ్యాధులు వచ్చే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. పసిపిల్లలు, వృద్ధులు ఎక్కువగా ఇబ్బందులు పడే పరిస్థితులు ఎదురవుతాయని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.ఫ్యాక్టరీ ఏర్పాటు చేయనున్న ప్రాంతానికి సమీపంలో సుమారు 60 వేల మంది నివాసముంటున్నారు.

ఆటోనగర్ సమీపంలో ..



అనువైన ప్రాంతం కాదు



పెదగంట్యాడలో సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయడం సరికాదు. ఈ ప్రాంతం అందుకు అనువైనది కూడా కాదు. ఇక్కడ ఏర్పాటు చేస్తున్న సిమెంట్ ఫ్యాక్టరీకి కూతవేటు దూరంలోనే పలు కాలనీలు ఉన్నాయి. ప్రభుత్వం స్పందించి వెంటనే అనుమతులు రద్దు చేయాలి.

–ధర్మాల రామిరెడ్డి, ధర్మాల వీధి, ఉక్కు నిర్వాసితుడు

ప్రభుత్వం స్పందించాలి



ఇక్కడ సిమెంట్ ఏర్పాటు చేయడాన్ని ప్రజలంతా ముక్త కంఠంతో వ్యతిరేకిస్తున్నారు. ఈ ఫ్యాక్టరీ వల్ల అనేక అనర్థాలు ఉన్నాయి. ప్రభుత్వం వెంటనే స్పందించి అనుమతులు రద్దు చేయాలి. ప్రజలను కాలుష్యం బారి నుంచి రక్షించాలి. ప్రజలు ఆరోగ్యం, పిల్లల భవిష్యత్‌ను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.

– గొందేశి వెంకటలక్ష్మి, పెదగంట్యాడ

అంతా కలిసి అడ్డుకోవాలి



గాజువాక, పెదగంట్యాడ మండలాల్లో సుమారు 2 లక్షల మంది నివాసితులు ఉన్నారు. సిమెంట్ ఫ్యాక్టరీ నుంచి వచ్చే కాలుష్యం కారణంగా వీరంతా అనేక సమస్యలతో సతమతమయ్యే ప్రమాదం ఉంది. దీనిపై ప్రభుత్వం పునరాలోచన చేయాలి. ప్రజా ప్రతినిధులు, నాయకులు కూడా స్పందించి పరిశ్రమను అడ్డుకోవాలి.

– కురందాసు అప్పలకొండ, సీతానగరం, పెదగంట్యాడ

వ్యతిరేకత మొదలైంది



అంబుజా సిమెంట్ పరిశ్రమ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించడంతో ప్రజల నుంచి ఇప్పటికే తీవ్ర వ్యతిరేకత మొదలైంది..కొన్ని రోజులుగా వివిధ రూపాల్లో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రజలకు హాని తలపెట్టే పరిశ్రమను నాయకులు, అధికారులు స్పందించి రద్దు చేయాలి. ప్రజారోగ్యాన్ని కాపాడాలి.

– మొల్లి మురళి, మొల్లివానిపాలెం

క్లుప్తంగా

వెంకన్న ఆలయానికి రూ.25 వేలు అందజేత


రూ.25వేల నగదు అందిస్తున్న పట్టా రామఅప్పారావు

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డు అగనంపూడి శాంతినగర్ కాలనీలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ దీపధూప నైవేద్యాల కోసం సమాచార హక్కు చట్టం ఉద్యమకర్త పట్టా రామ అప్పారావు దంపతులు రూ.25 వేల నగదును కమిటీకి అందించారు. ఆలయ ధర్మకర్త ఈకే చారి మాట్లాడుతూ స్వామివారి కైంకర్య సేవల కోసం రామ అప్పారావు అందించిన సహకారం ఎనలేనిదన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు స్వామి దివ్యాశీస్సులు అందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు సాయిబాబునాయుడు, మేడిశెట్టి ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

సీజేఐపై దాడికి నిరసనగా నేడు ధర్నా

ఉక్కునగరం: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్. గవాయ్‌పై దాడికి నిరసనగా మంగళవారం స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నామని అసోసియేషన్ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు బి. తౌడన్న, బయ్యే మల్లయ్య తెలిపారు. ఉక్కు అడ్మిన్ బిల్డింగ్ వద్ద ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించనున్న ధర్నాకు ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు, నాయకులు అభిమానులు హాజరు కావాలని వారు కోరారు.

అగనంపూడి ఆస్పత్రికి సాసా అవార్డు


అవార్డును కలెక్టర్ చేతుల మీదుగా అందుకుంటున్న ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ గోపీకృష్ణ

అగనంపూడి: స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్రా కార్యక్రమంలో భాగంగా ఆస్పత్రి ఆవరణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు చేస్తున్న కృషికి అగనంపూడి ప్రాంతీయ ఆస్పత్రికి సాసా అవార్డు వరించింది. ఈమేరకు సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ హరేందిర ప్రసాద్ అవార్డు అందించారు. అగనంపూడి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.గోపీకృష్ణ, ప్రతినిధులు డాక్టర పుష్పలత, నర్సింగ్ సూపరింటెండెంట్ హేమలక్ష్మి, ఫార్మసిస్ట్ గున్నయ్యశెట్టి, కౌన్సిలర్ ప్రసాద్ తదితరులు అవార్డు అందుకున్నారు.

ఉచిత నైపుణ్యాభివృద్ధి శిక్షణకు దరఖాస్తులు

పద్మనాభం: ఉచిత నైపుణ్యాభివృద్ధి శిక్షణ కోసం 18 నుంచి 25 ఏళ్ల లోపు అర్హులైన అభ్యర్థులు గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో కె.రూపేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫుడ్ అండ్ బేవరేజ్ సర్వీస్‌లో శిక్షణకు అభ్యర్థులు ఇంటర్ ఉత్తీర్ణులు కావాలని పేర్కొన్నారు. బ్రైడల్, ఫ్యాషన్ అండ్ పోర్ట్‌ఫోలియో మేకప్ ఆర్టిస్ట్ శిక్షణకు ఇంటర్, డిగ్రీ ఉత్తీర్ణులైన వారు అర్హులని తెలిపారు. ప్రొడక్షన్ మెషీన్ ఆపరేటర్‌కు ఇంటర్ ఎంపీసీ, బైపీసీ, బీఎస్సీ కెమిస్ట్రీ, ఐటీఐలో ఉత్తీర్ణులైన వారు, జనరల్ డ్యూటీ అసిస్టెంట్‌కు పదో తరగతి, ఇంటర్ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలియజేశారు. ఆస్పత్రి బిల్లింగ్ ఎగ్జిక్యూటివ్ శిక్షణ కోసం గ్రాడ్యుయేట్, అండర్ గ్రాడ్యుయేట్ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని తెలిపారు. ఎంపికైన వారికి మెప్మా ఆధ్వర్యంలో శిక్షణ ఇవ్వనున్నట్టు తెలియజేశారు. మిగతా వివరాలకు 79930 11605 నంబరులో సంప్రదించాలని కోరారు.

ప్రజావసరాలకు అనుగుణంగా మాస్టర్‌ప్లాన్

విశాఖ సిటీ: ప్రజల అవసరాలకు అనుగుణంగా మాస్టర్‌ప్లాన్ రూపొందిస్తున్నట్లు వీఎంఆర్‌డీఏ చైర్మన్ ఎం.వి.ప్రణవ్‌గోపాల్, కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ తెలిపారు. మాస్టర్‌ప్లాన్–2041పై సోమవారం వీఎంఆర్‌డీఏ సమావేశ మందిరంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. మాస్టర్‌ప్లాన్ రూపకల్పనపై అధికారులకు పలు సూచనలు చేశారు. అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవాలని చెప్పారు. త్వరలోనే సమగ్రమైన మాస్టర్‌ప్లాన్‌ను తీసుకువస్తామన్నారు. సమావేశంలో వీఎంఆర్‌డీఏ జాయింట్ కమిషనర్ కె.రమేష్, కార్యదర్శి మురళీకృష్ణ, ముఖ్య ప్రణాళిక అధికారి శిల్ప, ఇతర విభాగ అధికారులు పాల్గొన్నారు.

ఎంపీపీ పాఠశాలకు మైక్ సెట్ వితరణ


మైక్ సెట్ అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ: గొందేశి ప్రభాకర్‌రెడ్డి జయంతిని పురస్కరించుకుని ఆయన కుమారుడు దినేష్‌రెడ్డి పెదకోరాడ ఎంపీపీ పాఠశాలకు మైక్ సెట్ అందజేయడం అభినందనీయమని మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. ఐఎన్‌టీయూసీ ఆర్గనైజింగ్ ప్రెసిడెంట్ గొందేశి ప్రభాకర్‌రెడ్డి జయంతి సందర్భంగా సోమవారం ఆయన చిత్రపటానికి నాగిరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా నాగిరెడ్డి మాట్లాడుతూ పాఠశాలకు అవసరమైన సామగ్రి అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నాయకులు గొందేశి మహేశ్వరరెడ్డి, మద్ది శ్రీనివాసరావు, గొందేశి మధుసూదన్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులతో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అప్పారావు, సిబ్బంది

పెదగంట్యాడ: యారాడ ఉన్నత పాఠశాల విద్యార్థులు క్రీడల్లో ప్రతిభ చూపారు.ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో భాగంగా ఈ నెల 4న ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో ఫుట్‌బాల్ అండర్–14, అండర్–17 బాలికల విభాగంలో జిల్లా స్థాయి ఎంపికలు నిర్వహించారు. అండర్–17 విభాగంలో 9వ తరగతి విద్యార్థి వనం పరిపూర్ణ, అండర్– 14 విభాగంలో 8వ తరగతి విద్యార్థిని బంక అఖిల అర్హత సాధించారు. ఈ సందర్భంగా సోమవారం విద్యార్థులను పాఠశాల హెచ్‌ఎం అప్పారావు, సిబ్బంది అభినందించారు. రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.

మళ్లీ మూలకు చేరిన లిఫ్ట్

నిర్వహణ తీరుపై ప్రయాణికుల ఆగ్రహం


మరమ్మతులకు గురైన లిఫ్ట్

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్‌లో లిఫ్ట్ మళ్లీ మరమ్మతులకు గురైంది. నెల రోజుల వ్యవధిలో ఇది రెండోసారి కావడంతో నిర్వహణ తీరుపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నాలుగో ప్లాట్‌ఫారం వైపు ఏర్పాటు చేసిన ఈ లిఫ్ట్ ప్రారంభం నుంచి మరమ్మతులకు గురవుతుండడంతో ప్రయాణికులు నానా ఇబ్బందులు పడుతున్నారు. రెండు రోజుల నుంచి లిఫ్ట్ నిర్వహణ పనులు చేపడుతున్నామని నోటీస్ అతికించి ఉంచడంపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పిల్లలు, లగేజీలతో అవస్థలు పడుతున్నామని వాపోతున్నారు.

మార్మోగిన గోవింద నామస్మరణ


ఉక్కు వేంకటేశ్వరస్వామి ఆలయంలో గిరిప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

భక్తిశ్రద్ధలతో గిరి ప్రదక్షిణ

ఉక్కునగరం: స్థానిక సెక్టార్–1లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం గిరి ప్రదక్షిణ వైభవంగా జరిగింది. పౌర్ణమి సందర్భంగా సాయంత్రం ఏర్పాటు చేసిన గిరి ప్రదక్షిణ ఆద్యంతం గోవింద నామస్మరణ మార్మోగింది. ఆలయ అర్చకులు భావనారాయణ స్వామి, మనోజ్ స్వామి, హరినారాయణ స్వామి నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. వేకువజామున వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. స్వామి పచ్చ కర్పూరంతో ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

9న అవయవ దానంపై అవగాహన సదస్సు

ఉక్కునగరం: స్టీల్ ఎగ్జిక్యూటివ్ అసోసియేషన్ (సీ) భవన్‌లో ఈనెల 9న అవయవ– శరీర దానంపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఎం.ఎస్.ఎన్. మూర్తి, ఈపూరి బుచ్చిరాజు తెలిపారు. ఉక్కునగరం, కూర్మన్నపాలెం, అగనంపూడి ప్రాంతాలకు చెందిన స్వచ్ఛంద సంస్థలు స్పందన చేయూత ఫౌండేషన్, ఉక్కు అధికారుల సంఘం, లయన్స్ క్లబ్, మానవత స్వచ్ఛంద సాంఘిక సేవా సంస్థ, సీనియర్స్ సిటిజన్ అసోసియేషన్, సర్వహిత చారిటబుల్ ట్రస్ట్, మానవ వికాస వేదిక సంస్థల ఆధ్వర్యంలో సదస్సు జరుగుతుందని పేర్కొన్నారు. ఆ రోజు సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు జరగనున్న సదస్సులో అఖిల భారత అవయవ, శరీర దాతల సంఘం వ్యవస్థాపక అధ్యక్షురాలు డాక్టర్ గూడూరు సీతాలక్ష్మి ముఖ్య వక్తగా ప్రసంగించనున్నారన్నారు.

విద్యాప్రదాత అర్జునరావు


అర్జునరావుకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

అగనంపూడి: క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచిన పంపాన అర్జునరావు నైతిక విలువలతో కూడిన విద్య అందించేందుకు ఎంతో శ్రమించారని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. ఏవీకే విద్యా సంస్థల చైర్మన్ పంపాన అర్జునరావు ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విలువలతో కూడిన విద్యను అందించాలని నిత్యం కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో గాజువాక బీజేపీ కన్వీనర్ కరణం రెడ్డి నరసింగరావు, కార్పొరేటర్ ఏజే స్టాలిన్, పారిశ్రామికవేత్తలు చీకటి సత్యనారాయణ, ఏవీకే విద్యా సంస్థల కరస్పాండెంట్ పంపాన త్రినాథ్, వాసీ ప్రతినిధులు పాల్గొన్నారు.

గో బ్యాక్ అంబుజా

- ప్రజాభిప్రాయ సేకరణ ఏర్పాట్లను అడ్డుకున్న వైనం


నిరసన తెలుపుతున్న నాయకులు

పెదగంట్యాడ: అంబుజా సిమెంట్ పరిశ్రమ ఏర్పాటుపై ఈ నెల 8న జీవీఎంసీ మైదానంలో ప్రజాభిప్రాయ సేకరణకు అధికారులు చేస్తున్న ఏర్పాట్లను వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి, నాయకులుగొందేశి శ్రీనివాసరెడ్డి, మంత్రి శంకరనారాయణ స్థానికులతో కలసి అడ్డుకున్నారు. గో బ్యాక్ అంబుజా అంటూ నినాదాలు చేశారు. ఇప్పటికే గంగవరం పోర్టు ద్వారా వచ్చే కాలుష్యంతో వ్యాధుల బారిన పడుతున్నామని.. ఈ ఫ్యాక్టరీ పెడితే స్థానికుల ఆరోగ్యానికి మరింత హాని కలుగుతుందన్నారు. పరిశ్రమ ప్రతిపాదనను వెనక్కి తీసుకునే వరకూ పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో కిల్లాన ముసలయ్య, పిట్ట గురునాథ్ రెడ్డి, బసా అప్పలరెడ్డి, సింహాద్రి, నీలాపు అప్పన్న పాల్గొన్నారు.

అదానీ సిమెంట్ కంపెనీ నిర్మాణం ఆపాలి

డాబాగార్డెన్స్: గాజువాక పెదగంట్యాడ వద్ద జనావాసాల మధ్య అదానీ సంస్థ అంబుజా సిమెంట్ కంపెనీ నిర్మించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తోందని, ఈ ప్రతిపాదనను రద్దు చేయాలని జీవీఎంసీ సీపీఎం ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి.గంగారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతూ జీవీఎంసీ కౌన్సిల్‌లో తీర్మానించేందుకు వెంటనే సమావేశం నిర్వహించాలని మేయర్ పీలా శ్రీనివాసరావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ నెల 8న ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్నట్టు రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ప్రకటించిందన్నారు. అదానీ సిమెంట్ కంపెనీ వల్ల గాజువాక, పెదగంట్యాడ, కూర్మన్నపాలెం ప్రాంతాలు మొత్తం ప్రమాదకరమైన దుమ్ము, ధూళి విషకణాలతో నిండిపోతాయని, తాగునీరు కాలుష్యమవుతుందని, ప్రజలు అనేక ప్రాణాపాయ జబ్బులకు గురవుతారని పేర్కొన్నారు. జీవీఎంసీకి సరఫరా అయ్యే తాగునీరు, ఏలేరు కెనాల్, నీటి రిజర్వాయర్లు విష కాలుష్యమవుతాయన్నారు. ఈ నేపథ్యంలో విశాఖ పౌరుల ఆరోగ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత జీవీఎంసీ ప్రజాప్రతినిధులపై ఉందన్నారు. తక్షణమే ఎటువంటి జాప్యం లేకుండా జీవీఎంసీ కౌన్సిల్, రాజకీయ పక్షాల ఫ్లోర్ లీడర్లతో సమావేశం ఏర్పాటు చేయాలని గంగారావు విజ్ఞప్తి చేశారు. నగర ప్రథమ పౌరుడిగా ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొని అదానీ అంబుజా సిమెంట్ కంపెనీ ప్రతిపాదనను వ్యతిరేకించాలని కోరారు.

‘వరల్డ్ స్పేస్ వీక్’ పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏయూ వీసీ ఆచార్య రాజశేఖర్

మద్దిలపాలెం: ఆంధ్ర విశ్వవిద్యాలయం జియో ఇంజినీరింగ్ విభాగంలో స్టూడెంట్ సొసైటీ ఉర్విక్రుతి ఆధ్వర్యంలో నిర్వహించనున్న ప్రపంచ అంతరిక్ష వారోత్సవాల పోస్టర్‌ను వీసీ ఆచార్య జి.పి రాజశేఖర్ సోమవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ వరల్డ్ స్పేస్ వీక్‌పై విద్యార్థుల్లో విస్తృత అవగాహన కల్పించే విధంగా పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా 10వ తేదీన విభాగ విద్యార్థులకు క్రీడా పోటీలు, 11న మోడల్ యునైటెడ్ నేషన్స్ (ఎంయూఎన్), 12న ఐడియాథాన్ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 13న పోస్టర్, పేపర్ ప్రజెంటేషన్, 14 స్పేషియల్ టెక్నాలజీస్–ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అంశంపై సదస్సు, విశిష్ట ప్రసంగాలు, వివిధ పోటీలలో విజేతలుగా నిలచిన విద్యార్థులకు బహుమతుల ప్రదానోత్సవం ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య పి.జగదీశ్వరరావు పాల్గొన్నారు.

గడువులోగా వినతులు పరిష్కరించాలి

విశాఖ సిటీ : వీఎంఆర్‌డీఏ ప్రజాదర్బార్‌కు వచ్చిన వినతులను పరిశీలించి నిర్దేశించిన గడువులోగా పరిష్కరించాలని వీఎంఆర్‌డీఏ చైర్మన్ ఎం.వి.ప్రణవ్‌గోపాల్ అధికారులను ఆదేశించారు. సోమవారం వీఎంఆర్‌డీఏ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ప్రజల నుంచి తొమ్మిది వినతులను స్వీకరించారు. ఆయా వినతులను సంబంధిత అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ కె.రమేష్, కార్యదర్శి మురళీకృష్ణ, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఎయిడెడ్ టీచర్లకు ఇంకా అందని వేతనాలు

ఆరిలోవ: ఉమ్మడి విశాఖ జిల్లాలో ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబరు నెల వేతనాలు ఇంతవరకు చెల్లించలేదు. జిల్లాలో 17 ఎయిడెడ్ పాఠశాలల్లో సుమారు 65 మంది వరకు ఉపాధ్యాయులు పనిచేస్తున్నారని, వారంతా వేతనాల కోసం ఎదురు చూస్తున్నారని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.ఆర్.అంబేడ్కర్ ఆందోళనన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఎయిడెడ్ టీచర్ల వేతనాలు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.